సాక్షి నాగర్‌కర్నూల్

సోమవారం ; 9 ; డిసెంబర్ ; 2024



సైబర్ నేరం గుట్టురట్టు

రూ.36.20 లక్షలు మోసపోయిన సైబర్ కేసును జడ్చర్ల పోలీసులు ఛేదించారు.

వివరాలు 8లో ▸



'మహాలక్ష్మి'కి విశేష స్పందన

ఆర్టీసీ బస్సుల్లో మహాలక్ష్మి పథకానికి మహిళల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.7 /20.4


వాతావరణం

ఉదయం, సాయంత్రం బలమైన శీతల గాలులు వీస్తాయి. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురుస్తాయి.


నల్లమలకు పర్యాటక శోభ

- ప్రకృతి ప్రేమికులకు ఆహ్లాదం పంచనున్న నల్లమల, కృష్ణా తీర ప్రాంతాలు
- ప్రత్యేక కళ సంతరించుకోనున్న సోమశిల సర్క్యూట్
- అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దేలా ప్రణాళిక
- ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి

ఎకో టూరిజం అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు



సోమశిల వద్ద కృష్ణానది, కాటేజీల నిర్మాణం



అక్కమదేవి గుహలు

అచ్చంపేట: ఉమ్మడి జిల్లాలో ఉన్న అటవీ ప్రాంతం , వన్యప్రాణులను కాపాడటమే కాక ప్రకృతి ప్రేమికులకు ఆహ్లాదం పంచేలా రాష్ట్ర ప్రభుత్వం ఎకో టూరిజం (పర్యావరణ పర్యాటకం)పై దృష్టిసారించింది. అటవీ, ఆలయాలు, నదులు సమూహాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఈ మేరకు చారిత్రక, వారసత్వ, ఆధ్యాత్మిక కేంద్రాలకు నిలయమైన ఉమ్మడి పాలమూరులో 34 పర్యాటక ప్రాంతాలను గుర్తించారు. ప్రముఖ ఆలయాలు, నదులు, అపురూప కట్టడాలు, నల్లమల అటవీ ప్రాంతం వంటివి ఇప్పటికే అలరిస్తున్నాయి. మరోవైపు అమ్రాబాద్ అభయారణ్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులతో నల్లమల పర్యాటక శోభ సంతరించుకోనుంది. దక్షిణ భారత దేశంలోనే ప్రత్యేకంగా నిలిచిన నల్లమల అడవుల్లో ఎటు చూసినా పచ్చదనం, భారీ వృక్షాలు, అరుదైన పక్షులు, ఔషధ మొక్కలు, కృష్ణానది జలపాతాలు ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తాయి. ఈ క్రమంలోనే నల్లమల, కృష్ణా తీర ప్రాంతాల్లోని ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలను చుట్టొచ్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయి.

నల్లమలను గుర్తించేలా..

తెలంగాణ సాంస్కృతిక, చారిత్రక, పర్యాటక వైభవాన్ని ప్రజలకు, భవిష్యత్ తరాలకు అందించడానికి కేంద్ర ప్రభుత్వం కృషిచేస్తోంది. ఈ క్రమంలో పర్యాటక రంగానికి ఊతమిచ్చేలా స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్, యూనియర్ టెరిటరీస్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ (ఎస్‌ఏఎస్‌సీఐ) పథకం కింద ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు జిల్లాలోని సోమశిల ఈసర్క్యూట్ల అభివృద్ధి కోసం గత నెల 29న రూ.68 కోట్లు మంజూరు చేసింది. ఈగలపెంట వద్ద బొటానికల్ గార్డెన్, పిల్లల ఆట స్థలాలు, వివిధ శిల్పాల ఏర్పాటు, బోటింగ్ పాయింట్ సిద్ధం చేశారు. లైవ్ రూఫ్‌టాప్, కాటేజీల నిర్మాణం, హస్తకళల బజారులో చెంచుల జీవన విధానం, అటవీ ఉత్పత్తులు, చెంచులు తయారు చేసిన వస్తువుల ప్రదర్శన, యాంఫీ థియేటర్ ఏర్పాటు చేయనున్నారు.

రోప్‌వే ఏర్పాటుకు రూపకల్పన..

నల్లమలలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసింది. ఇందులో రూ.10 కోట్లతో మల్లెలతీర్థంలో కాటేజీలు, రోప్‌వే నిర్మాణ పనులు చేపడుతారు. మరో రూ.5 కోట్లతో వ్యూపాయింట్ అభివృద్ధి, రూ.5 కోట్లతో అక్కమదేవి గుహలు, సలేశ్వరక్షేత్రం, భౌరాపూర్ ప్రాంతాల్లో రెండు లాంచర్లు, మరో రూ.5 కోట్లతో డిండి ప్రాజెక్టు వద్ద అభివృద్ధి పనులు చేయనున్నారు. ఉమామహేశ్వర ఆలయం నుంచి మన్ననూర్ వరకు రోప్‌వే ఏర్పాటుకు ఇప్పటికే రూపకల్పన చేశారు.

ప్రణాళిక రూపొందించాం..



నల్లమలలోని వనరులను ఉపయోగించుకుని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తాం. టూరిజంతో ఆదాయం పెరగడమే కాక స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. వివిధ అభివృద్ధి పనులకు ప్రణాళిక రూపొందించి.. విడతల వారీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– వంశీకృష్ణ, ఎమ్మెల్యే, అచ్చంపేట

పెద్దఎత్తున ఉపాధి..



నల్లమలతోపాటు కృష్ణా తీర ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం. ఎకో టూరిజం అభివృద్ధిలో భాగంగా స్థానికులకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలను కల్పిస్తాం. సోమశిల సర్క్యూట్‌ను అభివృద్ధి పరుస్తాం. నల్లమల అటవీ ప్రాంతం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.

– జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి



నల్లమలలోని మల్లెలతీర్థం జలపాతం

ఆధ్యాత్మికం.. పర్యాటకం

నల్లమలలో అడుగడుగునా ఆధ్యాత్మిక క్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలు కనిపిస్తాయి. ఉమామహేశ్వర క్షేత్రానికి 24 గంటల పాటు, మన్ననూర్ ప్రతాపరుద్రుడి కోటపైకి పర్యాటకులను అటవీశాఖ ఆంక్షలతో కూడిన అనుమతులు ఇస్తున్నారు. ఫర్హాబాద్ నుంచి వ్యూపాయింట్ సఫారీ దృశ్యం, భౌరాపూర్ భ్రమరాంబమల్లికార్జునస్వామి ఆలయం, భౌరాపూర్ చెరువు, మల్లెలతీర్థం, దోమలపెంట సమీపంలోని ఆక్టోపస్ వ్యూ పాయింట్ ఇప్పటికే పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. లోతట్టు ప్రాంతంలోని అక్కమదేవి గుహలు, కదలివనం, దత్తపాదుకల క్షేత్రాలు, శ్రీశైలం, అంతర్‌గంగ, లొద్దిమల్లయ్య, కొల్లాపూర్ ప్రాంతంలోని అమరగిరి, సోమశిల లలితాంబిక సోమేశ్వర క్షేత్రాలు దర్శనానికి అనువుగా ఉన్నాయి.

తొమ్మిది నెలలపాటు సలేశ్వరం సందర్శన..

తెలంగాణ అమరనాథ్‌గా ప్రసిద్ధిగాంచిన సలేశ్వర క్షేత్రానికి పెద్దసంఖ్యలో భక్తులు వస్తారు. అయితే ప్రతిఏటా ఏప్రిల్‌లో వచ్చే పౌర్ణమికి ఐదు రోజులపాటు మాత్రమే భక్తులను అనుమతిస్తారు. తాజాగా ప్రకృతి పర్యాటకం పేరుతో మూడు నెలలు మినహా 9 నెలల పాటు భక్తులకు అందుబాటులోకి తెచ్చే ప్రక్రియ మొదలైంది. పర్యావరణానికి, వన్యప్రాణులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సాహస యాత్రకు రూపకల్పన చేస్తున్నారు. జీపు సఫారీతోపాటు ట్రెక్కింగ్ సహా మొత్తం 6 గంటల వ్యవధితో ప్రత్యేక ప్యాకేజీని అటవీ శాఖ రూపొందిస్తోంది. సలేశ్వరం క్షేత్రానికి నిరంతరం భక్తులను అనుమతించడంతో లోతట్టు ప్రాంతంలోని పుల్లాయిపల్లి, రాంపూర్ చెంచులకు ఉపాధి లభించనుంది.

కృష్ణానదిలో లాంచీ ప్రయాణం

పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే సోమశిల నుంచి శ్రీశైలానికి కృష్ణానదిలో బోటు ప్రయాణం ద్వారా ఎకో, రివర్ టూరిజం రెండు ఒకేసారి అభివృద్ధి కానున్నాయి. సోమశిల వద్ద సాహస క్రీడల కోసం స్పీడ్ బోటు షికారు అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలను మంత్రి జూపల్లి చేస్తున్నారు.

ఆదాయ మార్గాలు మెరుగు

ఎకో టూరిజం అభివృద్ధితో ఆదాయం పెరగనుంది. ప్రధానంగా వారాంతపు సెలవుల్లో పెద్దఎత్తున పర్యాటకులు వచ్చే అవకాశం ఉంది. పర్యాటక శాఖ ద్వారా గైడ్‌గా ఆయా ప్రాంతాల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. జిల్లాకు చెందిన రేవంత్‌రెడ్డి సీఎంగా, పర్యాటక శాఖ మంత్రిగా జూపల్లి కృష్ణారావు ఉండటంతో ఈ ప్రాంతం అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రకృతి ఒడిలో సేద తీరేందుకు పర్యాటకులు వస్తుండడంతో ఈ మార్గంలో ప్రైవేట్ రంగంలోనూ హోటళ్లు, విడిది కేంద్రాలు ఏర్పాటు అవుతున్నాయి.

మామిడి మురిపించేనా..?



- పూత ప్రారంభ దశలో వాతావరణంలో అనూహ్య మార్పులు
- అకాల వర్షాలతో చిగుర్లు వస్తున్న వైనం
- చలి కారణంగా పెరిగిన తెగుళ్ల తీవ్రత
- పురుగు మందులకు రూ.వేలు వెచ్చిస్తున్న రైతులు



నిండుగా పూసిన మామిడి పూత

కొల్లాపూర్: వాతావరణంలో అనూహ్యంగా సంభవిస్తున్న మార్పులు మామిడి రైతులను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. తీవ్రమైన చలి, కాగు మంచు, అకాల వర్షాలు మామిడి దిగుబడులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. నవంబర్, డిసెంబర్ నెలల్లో చోటుచేసుకున్న వాతావరణ ప్రభావం మామిడి తోటలపై పడింది. తెగుళ్ల నివారణ, పూతలు రావడం కోసం ఒక్కో రైతు ఇప్పటికే రూ.వేలు ఖర్చు చేశారు.

మామిడి సాగు వివరాలు ఇలా..

నియోజకవర్గం	తోటలు సాగు చేస్తున్న రైతులు	విస్తీర్ణం ఎకరాలు
కొల్లాపూర్	11,981	25,237
కల్వకుర్తి	1,084	4,547
నాగర్‌కర్నూల్	771	2,510
అచ్చంపేట	622	2,418
మొత్తం	14,458	34,712

జిల్లాలో మామిడి సాగు..

జిల్లావ్యాప్తంగా 34,712 ఎకరాల్లో రైతులు మామిడి తోటలు సాగు చేస్తున్నారు. గత ఐదేళ్ల కాలంగా ఏటా 3 వేల ఎకరాల మేరకు సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల్లో 9 వేల ఎకరాల్లో మామిడి సాగు జరుగుతుండగా.. ఒక్క కొల్లాపూర్ నియోజకవర్గంలోనే అధికంగా 25 వేల ఎకరాలకు పైగా మామిడి సాగు జరుగుతోంది.

పూతలపై ప్రభావం..

నవంబర్ నెల నుంచి మామిడి తోటల్లో మొదటి పూతలు ప్రారంభమవుతాయి. డిసెంబర్ నెలలో రెండో దశ పూతలు వస్తాయి. అయితే నవంబర్ నెలలో పూతలు ప్రారంభమైనప్పటికీ తీవ్రమైన చలి, అకాల వర్షాల వల్ల పూతలు నల్లబడ్డాయి. దోమ, తేనెమంచు, పచ్చ పురుగులు పూతలను ఆశించాయి. వీటి నివారణ కోసం రైతులు రూ.వేలు వెచ్చించి రసాయన మందులు పిచికారీ చేసినా పూతలు నిలవలేదు. ఈ నెల ప్రారంభం నుంచి రెండో దశ పూతలు ప్రారంభమయ్యాయి. అకాల వర్షాల కారణంగా చాలా తోటల్లో పూతలకు బదులుగా చిగుర్లు వస్తున్నాయి. దీంతో పూతలు పూర్తిస్థాయిలో వచ్చేందుకు ఈసారి ఆలస్యమయ్యే పరిస్థితులు దాపురించాయి.

తుఫాన్ల ప్రభావం..

ఆంధ్రప్రదేశ్‌లో సంభవిస్తున్న తుఫాన్ల ప్రభావం నాగర్‌కర్నూల్ జిల్లాపై పడుతోంది. అక్కడ తుఫాన్లు ఉన్నప్పుడు కొల్లాపూర్‌తోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు పూర్తిగా మారిపోతాయి. చల్లటి గాలుల కారణంగా తెగుళ్ల బెడద తీవ్రమవుతోంది. కాగు మంచు వల్ల కూడా పురుగుల బెడద పెరుగుతోంది. గత 15 రోజుల వ్యవధిలోనే ఆంధ్రప్రదేశ్‌లో రెండు తుఫాన్లు రావడంతో ఆ ప్రభావం జిల్లాలోని మామిడి తోటలపై పడింది.

సస్యరక్షణ చేపట్టాలి



మామిడి పూతలు ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్నాయి. నవంబర్‌లో వచ్చిన పూతలు కొన్నిచోట్ల దెబ్బతిన్నాయి. చల్లగాలులు, అకాల వర్షాల ప్రభావం మామిడి పూతలపై ఉంటుంది. ఈ నెలలో మామిడి చెట్లకు నీళ్లు పెట్టొద్దు. భూమి బెట్టగా ఉంటేనే పూతలు వచ్చేందుకు వీలుగా ఉంటుంది. మామిడికి అధికంగా తేనె మంచు, బంక, బూడిద తెగుళ్లు వ్యాప్తి చెందుతాయి. వీటికి సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి ఫలితాలు ఉంటాయి. తెగుళ్ల నివారణకు మందులు ఎలా వాడాలనే అంశాలను రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాం.

– లక్ష్మణ్, ఉద్యానవన అధికారి, కొల్లాపూర్

న్యూస్‌రీల్

స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధికే ఆరోపణలు



వనపర్తి టౌన్: స్థానిక సంస్థల్లో లబ్ధి పొందేందుకు మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి తనతోపాటు ఎమ్మెల్యేపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని.. ప్రజలు ఆయనను నమ్మకనే అసెంబ్లీ ఎన్నికల్లో కర్రుకాల్చి వాత పెట్టారని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. ఆదివారం వనపర్తిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దింపుడు కల్లం ఆశలతో బీఆర్‌ఎస్ రాజకీయాలు చేస్తోందన్నారు. వనపర్తి జిల్లా కోసం నిరంజన్‌రెడ్డి ఎన్నో పర్యాయాలు తనను బతిమాలాడారని, కొల్లాపూర్‌లోని మూడు మండలాలు కలపకపోతే జిల్లా అయ్యేదా అని ప్రశ్నించారు. తప్పుడు ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వంలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలను నిలదీసే అవకాశం కాంగ్రెస్ ఇస్తోందని, దీంతో తప్పులు సరిదిద్దుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్సీ కవిత జైలులో ఉన్నప్పుడే తెలంగాణాలో చాలా పనులు జరిగాయని.. ఇప్పుడు బయటకొచ్చి ఏం తెలియకుండా మాట్లాడటం సరికాదని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు ప్రాక్టికల్‌గా చూసి చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటి వరకు పని చేసిన ఎమ్మెల్యేల కంటే 20 రెట్లు అధికంగా అభివృద్ధి చేసి నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు



కొండారెడ్డిపల్లిలో రైతులకు స్ప్రింక్లర్ పైపులు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

వంగూర్: రాష్ట్రంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు రావాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని కొండారెడ్డిపల్లిలో సబ్సిడీలో మంజూరైన స్ప్రింక్లర్ పైపులను 58 మంది రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రైతులకు సబ్సిడీ పరికరాలు అందించలేదని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి వాటిని అందిస్తున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో రైతులందరికీ మరిన్ని సబ్సిడీపై పథకాలు అందించేందుకు కృషిచేస్తామని, వాటి సహాయంతో ఉద్యానవన పంటలు సాగుచేసుకోవాలని సూచించారు. ఆయిల్‌పాం పంటతో రైతులు అధిక లాభాలను పొందవచ్చన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి, జిల్లా ఉద్యానవన అధికారి జగన్, డివిజన్ అధికారి స్రవంతి, నాయకులు పాండురంగారెడ్డి, వేమారెడ్డి, కృష్ణారెడ్డి, లాలుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలను అమలు చేయాలి

అచ్చంపేట రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు ఆరోపించారు. ఆదివారం అచ్చంపేటలోని టీఎన్‌జీఓ భవనంలో అసంఘటిత రంగ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచారన్నారు. 29 కార్మిక చట్టాలను కాలరాసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చారన్నారు. ఈ నెల 14, 15 తేదీల్లో అచ్చంపేటలో జరిగే సీపీఎం జిల్లా మూడో మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాములు, శివకుమార్, సయ్యద్, మల్లేష్, పార్వతమ్మ, సైదమ్మ, నిర్మల, రజిత, శివలీల తదితరులు పాల్గొన్నారు.



'అబద్ధాల కాంగ్రెస్‌ను గద్దె దించుదాం'



అచ్చంపేటలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

అచ్చంపేట రూరల్/ కల్వకుర్తి రూరల్: రాష్ట్రంలో మాయమాటలు, అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను గద్దె దింపుదామని బీజేపీ నాయకుడు, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో చార్జ్‌షీటు విడుదల చేస్తూ.. అచ్చంపేట, కల్వకుర్తిలో ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో వారు మాట్లాడుతూ హైడ్రా పేరుతో హైడ్రామా సృష్టిస్తూ కాలం వెళ్లదీస్తున్నారన్నారు. రేవంత్‌రెడ్డి సైతం మాయమాటలు చెప్పేవారేనని, ఆయన మీద ఆయనకే భరోసా లేదన్నారు. విద్యా భరోసా కార్డు, నిరుద్యోగ భృతి ఏమయ్యాయని ప్రశ్నించారు. బీసీ సబ్ ప్లాన్ అమలు చేయలేదని, యాదవ, కురుమ సంఘాలకు ఇస్తామన్నా హామీలు కూడా నెరవేర్చలేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఆశించిన మార్పు రాలేదని, నిజమైన ప్రజా ప్రభుత్వం రావాలంటే బీజేపీతోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ హయాంలో ఆర్థిక సంక్షోభం వచ్చిందని విమర్శించారు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని సంబరాలు చేసుకుంటున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు శేఖర్‌రెడ్డి, హరిప్రసాద్, దుర్గాప్రసాద్, రాంభూపాల్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, రామచంద్రారెడ్డి, నర్సింహా, నరేందర్‌రావు, మంగ్యానాయక్, బాలాజీ, జానకి, కొండల్‌రెడ్డి, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం



మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి లింగంయాదవ్

నాగర్‌కర్నూల్ క్రైం: బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని, ఏడాది క్రితం అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించామని టీపీసీసీ అధికార ప్రతినిధి లింగం యాదవ్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏడాది ప్రజా పాలనపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం 5 వేల స్కూళ్లను మూసివేస్తే కాంగ్రెస్ ఏడాది పాలనలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ప్రారంభించడంతోపాటు కాస్మొటిక్, డైట్ చార్జీలను పెంచారన్నారు. విద్యకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించిందని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతోపాటు ఆరోగ్యశ్రీని రూ.10 లక్షలకు పెంచామని, రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో కేసీఆర్ హయాంలో చేయని అభివృద్ధిని ఏడాదిలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసి చూపించారని అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో మంత్రులు ఎవరూ మాట్లాడేవారు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో అందరికీ స్వేచ్ఛ ఉందన్నారు. ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ప్రతిపక్షాలు తమ సలహాలు ఇచ్చి సహకరించాలి తప్ప వాటిని అడ్డుకోవడం సరికాదని అన్నారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ స్కిల్ యూనివర్సిటీని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. సమావేశంలో అధికార ప్రతినిధి ఆచారి, కౌన్సిలర్లు జక్క రాజ్ కుమార్ రెడ్డి, సునేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కమిషన్ పేరుతో కాలయాపన తగదు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ

తిమ్మాజిపేట: ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చినా.. కమిషన్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయడం తగదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ అన్నారు. ఆదివారం తిమ్మాజిపేటలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన వెంటనే మొదటగా వర్గీకరణ చేస్తామని స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తర్వాత కమిషన్ పేరుతో జాప్యం చేయడం సరికాదని, వర్గీకరణ ప్రక్రియ మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. మాదిగలు వర్గీకరణ ఉద్యమానికి రాజకీయాలకతీతంగా కలిసివచ్చి పోరాడాలని ఆయన కోరారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా బంగారు, రమేష్, అధికార ప్రతినిధిగా రవి శంకర్, ప్రధాన కార్యదర్శిగా విష్ణు, కార్యదర్శులుగా మన్యంకొండ, వినోద్ ఎన్నికయ్యారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా కన్వీనర్ జంగయ్య, విజయ్, కోకన్వీనర్ దశరథం, నాయకులు కాశిం, గస్‌రాజ్, దేవస్వామి, వెంకటయ్య, స్వామి, వెంకటేష్, రాజు, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

మహమ్మదాబాద్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని మొకర్లాబాద్ శివారులో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. మొకర్లాబాద్ శివారు ముందలితండా గ్రామ పంచాయతీ శ్మశాన వాటిక దగ్గర గుర్తుతెలియని వ్యక్తి(35) ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. అటువైపు వెళ్లిన గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి.. ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న వ్యక్తిని 108లో మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. దీంతో మృతదేహాన్ని ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. అయితే ఘటనా స్థలంలో పెట్రోల్ బాటిల్, సిగరెట్లు పడి ఉన్నాయి. మృతునికి సంబంధించి ఎలాంటి ఆనవాళ్లు లభించలేదు. దీంతో ఎవరైనా హత్య చేశారా.. లేక ఆత్మహత్య చేసుకున్నాడా అన్న కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

గట్టు: కర్నూలు–రాయచూర్ అంతర్రాష్ట్ర రహదారిపై బల్గెర సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. కర్ణాటకలోని తుర్కలదొనెకు చెందిన వడ్డె ఈదప్ప(40), బోయ వీరన్న బోరుమోటారు మరమ్మతు నిమిత్తం ఆదివారం అయిజకు వచ్చారు. రాత్రివేళ ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా.. మాచర్లకు చెందిన ఎద్దుల బండిని బల్గెర సమీపంలోని కాల్వ వద్ద దాటుతూ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఈదప్ప అక్కడికక్కడే మృతిచెందగా.. బోయ వీరన్న చెయ్యి విరిగింది. స్థానికులు వెంటనే 108కు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గద్వాల ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చెరువులో పడి యువకుడు మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: పశువులకు నీరు తాగించేందుకు చెరువుకు వెళ్లిన ఓ యువకుడు అందులో పడి మృతిచెందినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని నల్లవెల్లికి చెందిన సాయిచంద్ (30) శనివారం గ్రామ సమీపంలోని చెరువులో పశువులకు నీరు తాగించేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందాడు. గుర్తించిన స్థానికులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

కోడి పందేల స్థావరంపై దాడి

నాగర్‌కర్నూల్ క్రైం: కోడి పందేల స్థావరంపై దాడిచేసి పలువురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ ఆదివారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని చందాయిపల్లి శివారులో పలు గ్రామాలకు చెందిన 9 మంది కోడి పందేలు ఆడుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడిచేసి రఫీ, శాలి, సత్యం, మల్లేశ్, మధు, రహీం, ఖాజా, తిరుపతయ్య, నర్సింహను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి 8 కోళ్లు, 7 ద్విచక్ర వాహనాలు, రూ.2,540 నగదు స్వాధీనం చేసుకున్నారు. కోడిపందేలు ఆడుతున్న 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి

- డాక్టర్ షోయబ్ అహ్మద్‌ఖాన్



స్టేషన్ మహబూబ్‌నగర్: హజ్‌యాత్ర సమయంలో ఎండవేడిమి అధికంగా ఉండే అవకాశముందని, ఈమేరకు యాత్రికులు తగిన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ షోయబ్ అహ్మద్‌ఖాన్ సూచించారు. ఆదివారం జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో హజ్‌యాత్రికులకు మెడికల్ ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు వైద్యులు యాత్రికులకు అవగాహన కల్పించారు. 40 డిగ్రీల కంటే ఎండ ఉండే అవకాశం ఉందని ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. రెగ్యులర్‌గా వేసుకునే మందులను అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. జిల్లా హజ్ సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఈనెల 15న జిల్లా కేంద్రంలోని జేజేఆర్ గార్డెన్స్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు హజ్‌యాత్రికుల శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో వైద్యులు షోయబ్ అహ్మద్ ఖాన్, సిరాజుద్దీన్, షఫీతోపాటు జిల్లా హజ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మహమూద్‌అలీ, మేరాజుద్దీన్, ఎండీ.రవూఫ్, సత్తార్, సులేమాన్, ఖాజా నిజాముద్దీన్, ఫయాజ్, అహ్మద్ పటేల్, హైదర్, మూసా, రఫీక్ ఉర్ రహెమాన్, ఎండి.అర్షద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

‘మహాలక్ష్మి’కి విశేష స్పందన



మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న మహిళలు (ఫైల్)

- గతేడాది డిసెంబర్ 9న ప్రారంభం
- 15 నుంచి టిమ్ ద్వారా జీరో టికెట్లు జారీ
- గత నెల 30 వరకు రీజియన్‌లో 9.62 కోట్ల మహిళల ప్రయాణం
- ఆర్టీసీకి రూ.416.59 కోట్ల ఆదాయం
- ప్రతిరోజు సరాసరిగా 2.73 లక్షల మంది రాకపోకలు

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి విశేష స్పందన లభిస్తోంది. ఈ పథకాన్ని గతేడాది డిసెంబర్ 9వ తేదీ నుంచి ప్రారంభించారు. అయితే 15వ తేదీ నుంచి ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డుతో టిమ్ మిషన్ ద్వారా మహిళా ప్రయాణికులకు జీరో టికెట్లు అందజేశారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించడంతో ఈ బస్సులు మహిళలతో కిటకిటలాడుతున్నాయి. ఆర్టీసీ బస్సుల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా ఆక్యుపెన్సీ రేషియా పెరిగింది. గతేడాది నవంబర్‌లో 72.40 శాతం ఓఆర్ ఉంటే ఈ ఏడాది నవంబర్ వరకు అమాంతంగా 103.25 శాతానికి చేరింది. ఈపీకే గతేడాది 42.86 శాతం ఉండగా.. ప్రస్తుతం 61.33 శాతంగా ఉంది.

రీజియన్ పరిధిలో..

మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ పరిధిలోని 10 డిపోల్లో 43 సూపర్ లగ్జరీ బస్సులు, 34 డీలక్స్, 281 ఎక్స్‌ప్రెస్, 479 పల్లె వెలుగు బస్సులు ఉన్నాయి. ప్రతిరోజు రీజియన్ పరిధిలోని ఆర్టీసీ బస్సుల్లో మహిళలు, సాధారణ ప్రయాణికులు దాదాపు 4.50 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. మహాలక్ష్మి పథకంలో గతేడాది డిసెంబర్ 15 నుంచి గత నెల నవంబర్ 30 వరకు వరకు మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్‌లోని డిపోల పరిధిలో 9.62 కోట్ల మంది మహిళలు ప్రయాణించగా.. రూ.416.59 కోట్లకుపైగా ఆదాయం వచ్చింది. రీజియన్‌లో మహబూబ్‌నగర్ డిపో పరిధిలో అత్యధికంగా 1.30 కోట్ల మంది మహిళలు ప్రయాణించగా.. రూ.59.65 కోట్లకుపైగా ఆదాయం వచ్చింది. సాధారణ ప్రయాణికులతో పోలిస్తే మహిళల ప్రయాణం రీజియన్ పరిధిలో 60 శాతానికి దాటింది. ప్రతిరోజు రీజియన్ పరిధిలో 2.73 లక్షల మంది మహిళలు ప్రయాణిస్తుండగా.. మహాలక్ష్మి పథకం ద్వారా రోజువారి ఆదాయం దాదాపు రూ.1.18 కోట్లు వస్తోంది.

జిల్లాల వారీగా మహాలక్ష్మి పథకం వివరాలు (గతేడాది డిసెంబర్ 15 నుంచి ఈ ఏడాది నవంబర్ 30 వరకు)

జిల్లా	డిపో	ప్రయాణికులు (లక్షల్లో)	ఆదాయం (రూ.లక్షల్లో)
మహబూబ్‌నగర్	మహబూబ్‌నగర్	129.72	4,651.38
నాగర్‌కర్నూల్	అచ్చంపేట	75.24	4,222.17
	కల్వకుర్తి	100.77	5,013.33
	కొల్లాపూర్	67.71	3,124.86
	నాగర్‌కర్నూల్	124.82	4,242.66
నారాయణపేట	నారాయణపేట	82.48	4,065.48
	కోస్గి	101.01	4,671.71
వనపర్తి	వనపర్తి	137.78	5,594.21
రంగారెడ్డి	షాద్‌నగర్	95.68	4,173.96

దూర ప్రాంతాలకు సైతం..



ఆర్టీసీ బస్సుల్లో మహాలక్ష్మి పథకం ఉచిత ప్రయాణానికి మహిళల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ పథకాన్ని మహబూబ్‌నగర్ రీజియన్ పరిధిలోని మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. బస్సుల్లో సురక్షిత ప్రయాణం ఉండటంతో దూర ప్రాంతాలకు సైతం బస్సులనే ఆశ్రయిస్తున్నారు.

– సంతోష్‌కుమార్, రీజినల్ మేనేజర్, మహబూబ్‌నగర్

బైకు ఢీకొని తల్లీకుమారుడికి గాయాలు



ప్రమాద సమాచారం తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

ప్రైవేట్ వాహనంలో ఆస్పత్రికి తరలించిన ఎమ్మెల్యే

మహమ్మదాబాద్: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న తల్లీకుమారులను వెనకాల నుంచి బైకు ఢీకొనడంతో ఇద్దరూ గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని గాధిర్యాల్ స్టేజీ దగ్గర ఉన్న పౌల్ట్రీఫాంలో పనిచేస్తున్న వలస కూలీలు బీహార్‌వాసులు తల్లీకుమారులు బొమ్మాళి, ప్రసందిత్ ఆదివారం సాయంత్రం 7.30 గంటల సమయంలో స్టేజీ దగ్గరలో ఉన్న కిరాణం దగ్గరకు వెళ్తున్నారు. ఇదే సమయంలో వెనకాల నుంచి వచ్చిన బైకు ఇద్దరినీ వేగంగా ఢీకొనడంతో ఇద్దరికి కాళ్లు విరిగిపోయి తీవ్రంగా గాయపడ్డారు. అదే సమయంలో గాధిర్యాల్ గ్రామానికి వెళ్లి తిరిగి మహబూబ్‌నగర్ వెళ్తున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ప్రమదాన్ని తెల్సుకుని స్పందించారు. వెంటనే వారి దగ్గరికి వచ్చి ఓ ప్రైవేట్ వాహనంలో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారికి అన్ని రకాల వైద్యం చేయించేందుకు సహాయం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

శ్రీశైలం జలాశయానికి 8,126 క్యూసెక్కులు

దోమలపెంట: భూగర్భ కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతిలో 24గంటల వ్యవధిలో శ్రీశైలం ఆనకట్ట దిగువున సాగర్ జలాశయం నుంచి 8,126 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం జలాశయంలోకి (ఎత్తిపోతల) తరలించారు. పోతిరెడ్డిపాడు నుంచి 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,618, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భకేంద్రంలో 2.825 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. ఆదివారం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 864.1 అడుగుల వద్ద 119.1976 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

రామన్‌పాడుకు 1,240 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మదనాపురం: రామన్‌పాడులో ఆదివారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 390 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 450 క్యూసెక్కులు కుడి, ఎడమ కాల్వ ద్వారా 45 క్యూసెక్కులు వివిధ లిఫ్టుల ద్వారా 748 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.

ఎంపీ ఎక్కిన లిఫ్ట్ మొరాయింపు

జడ్చర్ల: పట్టణ శివారులోని 44వ నంబర్ జాతీయ రహదారిని అనుసరించి ఏర్పాటు చేసిన ఓ లాడ్జి ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి లిఫ్ట్‌లో పైఅంతస్తుకు వెళ్తుండగా కొద్దిసేపు మొరాయించింది. లిఫ్ట్‌లో ఎక్కువ మంది ఉండటంతో బరువు పెరిగి మధ్యలోనే ఆగిపోయింది. వెంటనే నిర్వాహకులు చేతులతో చక్రాలను తిప్పి లిఫ్ట్‌ను కిందకు దించారు. దాదాపు 10 నిమిషాల తర్వాత నెమ్మదిగా లిఫ్ట్ కిందకు దిగడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. లిఫ్ట్ దిగిన తర్వాత మెట్ల మార్గాన మల్లురవి పై అంతస్తుకు వెళ్లారు.

పత్తి వాహనం బోల్తా



రహదారిపై పడిన పత్తి

ఎర్రవల్లి: పత్తి లోడ్‌తో వెళ్తున్న ఓ వాహనం ఆదివారం కోదండాపురం సమీపంలో జాతీయ రహదారిపై అదుపుతప్పి బోల్తాపడటంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. మానవపాడుకు చెందిన సురేశ్ బొలెరో వాహనంలో పత్తి నింపుకొని రాయచూర్‌కు బయలుదేరారు. జాతీయ రహదారిపై కోదండాపురం సమీపంలో వాహనం జాయింట్ వీల్ విరిగిపోవడంతో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సురేశ్‌కు గాయాలు కాగా.. చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో హైవేపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు, హైవే సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని వాహనాన్ని, పత్తిని తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.

21 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మక్తల్: అనుమతి లేకుండా రేషన్‌బియ్యం తీసుకెళ్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. నారాయణపేట జిల్లా మక్తల్‌కు చెందిన వీరేషం 21 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా కర్ణాటక రాష్ట్రాన్ని తరలిస్తున్నట్లు .. ముందస్తు సమాచారంతో దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి పేర్కొన్నారు. వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

పాపను మింగిన పాంపాండ్ గుంత



వైష్ణవి మృతికి కారణమైన పాంపాండ్ గుంత



ఉప్పుతో కప్పేసిన వైష్ణవి మృతదేహం

- సెల్‌ఫోన్‌తో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు గుంతలో పడిన చిన్నారి
- ప్రాణం తిరిగొస్తుందని మూఢ నమ్మకంతో ఒంటికి ఉప్పు రాసిన వైనం

హన్వాడ: పాఠశాలకు సెలవురోజు కావడంతో తల్లిదండ్రుల వెంట పొలానికి వెళ్లిన చిన్నారి.. పొలంలో నీటినిల్వ కోసం ఏర్పాటు చేసిన పాంపాండ్ నీటి గుంతలో జారిపడి మృత్యువాత పడింది. అయితే ప్రాణం తిరిగి వస్తుందనే మూఢనమ్మకంతో పాప ఒంటికి ఉప్పు రాసిన సంఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. సల్లోనిపల్లి గ్రామానికి చెందిన కేశవులు, మాధవి దంపతులకు ముగ్గురు సంతానం. అయితే ఆదివారం సెలవు రోజు కావడంతో తమతోపాటు వ్యవసాయ పొలానికి పెద్ద కూతురు వైష్ణవి(7) తీసుకెళ్లారు. దీంతో చిన్నారి సెల్‌ఫోన్‌ను చూస్తూ పొలంలోని పాంపాండ్ గుంతలో పడిపోవడంతో.. సమీపంలో ఉన్న వారు తల్లిదండ్రులకు చెప్పగా నీటి గుంతలో గాలించగా.. చివరికి చిన్నారి మృతదేహం లభించింది.

ఒంటిపై ఉప్పు ప్రయోగం..

నీటిగుంతలో పడి మృత్యువాత పడిన చిన్నారి వైష్ణవిని బయటికి తీసిన గ్రామస్తులు పొట్ట భాగంపై నొక్కడంతో నోటిలో నుంచి నురగలు వచ్చాయి. నీరు రాకపోవడంతో పోయిన ప్రాణం తిరిగివస్తుందనే నమ్మకంతో చిన్నారి ఒంటి నిండా ఉప్పుతో కప్పేశారు. దాదాపు గంటపాటు వేచిచూసి స్థానిక వైద్యుడి చేత నాడీ పరీక్షలు చేసినా ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో బోరున విలపించారు.

సంపులో పడి మరో బాలిక..



హన్సిక మృతదేహం

గండేడ్: ప్రమాదవశాత్తు నీటిసంపులో పడి బాలిక మృతిచెందిన సంఘటన రుసుంపల్లిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కోస్గి వెంకటయ్య, పద్మమ్మలకు కుమారుడు హర్షవర్ధన్, కూతురు హన్సిక(5) ఉన్నారు. ఆదివారం ఉదయం తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లగా.. చిన్నారులు సైతం వారితోపాటే వెళ్లారు. అయితే ఆడుకుంటూ పొలం దగ్గర బోరు నీళ్లు పోసే చిన్నపాటి గుంత దగ్గరికి వెళ్లగా.. అదే సమయంలో బాలిక హన్సికకు ఫిట్స్ రావడంతో గుంతలో పడి అక్కడికక్కడే మృతిచెందింది. అప్పటి వరకు కళ్ల ముందు ఆడుకుంటున్న చిన్నారి ఒక్కసారిగా మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

సైబర్ నేరం గుట్టురట్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకి.. చిత్రంలో పోలీసు అధికారులు, నిందితులు

- ముగ్గురు నిందితుల అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు
- నిందితుల్లో బ్యాంకు మేనేజర్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ జానకి

జడ్చర్ల: వాట్సాప్ గ్రూప్ ద్వారా పరిచయమైన ఓ గుర్తు తెలియని వ్యక్తి సూచనలు పాటిస్తూ రూ.36.20 లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయిన కేసును జడ్చర్ల పోలీసులు ఛేదించారు. సదరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందులో ఓ బ్యాంకు మేనేజర్ పాత్ర ఉండటంతో ఆయనను కూడా అరెస్ట్ చేశారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను ఆదివారం ఎస్పీ జానకి జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరించారు. ఈ ఏడాది ఏప్రిల్ 11న బాదేపల్లి బాటీ స్ట్రీట్ వ్యాపారి రఘువర్ సునీల్ సెల్‌నంబర్‌ను గుర్తు తెలియని ఓ వ్యక్తి గ్రోవెన్షన్ మీడియా ఎఫ్‌ఎక్స్–972 గ్రూప్‌లో యాడ్ చేశాడు. ఆ గ్రూప్‌లోని ప్రోడక్ట్స్, ప్రాంతాలకు సంబంధించి గూగుల్ రివ్యూస్ ఇచ్చిన వారికి రూ.150 చొప్పున బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని చెప్పగా పోస్ట్ చేశాడు. చెప్పినట్లుగా మొదట ఆయన బ్యాంకు ఖాతాలో రూ.150 చొప్పున జమయ్యాయి. తర్వాత టెలిగ్రామ్ గ్రూప్‌లో యాడ్ చేసి ఆ గ్రూప్‌లో వివిధ రకాల టాస్క్‌లిచ్చి వాటిపై పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మబలికారు. వాటిని నమ్మి మొదట రూ.2 వేలు పెట్టి టాస్క్ పూర్తి చేయగా రూ.3,800 వచ్చాయి. వచ్చిన డబ్బును అందులోనే ఒక ఖాతా తెరిచి డబ్బు వచ్చినట్లుగా చూపించారు. దశల వారీగా రూ.5 వేల నుంచి రూ.36,20,180 వరకు పెట్టుబడి పెట్టారు. చివరకు తనకు రావాల్సిన డబ్బును ఖాతాలో జమ చేయాలని కోరగా మరో రూ.10 లక్షలు వెచ్చించాలని, అప్పుడే పెట్టుబడిగా పెట్టిన డబ్బు ఖాతా నుంచి రిలీజ్ చేస్తామని చెప్పారు. తాను మోసపోయానని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. రఘువార్ సునీల్ నుంచి ఖాజేసిన డబ్బు సిద్దిపేటలోని బంధన్ బ్యాంకులోని ఓ ఖాతాకు వెళ్లినట్లు గుర్తించిన పోలీసులు అక్కడి నుంచి విచారణ చేపట్టారు. సిద్దిపేటకు చెందిన మహ్మద్ సమీయొద్దీన్, మహ్మద్ అబ్దుల్ ఫహద్, వల్లోజు శిరీష్ కుమార్, సయ్యద్ ముస్తఫా రాజా ఖాద్రి ముఠాగా ఏర్పడి సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. నిందితుల్లో ఉన్న వల్లోజు శిరీష్‌కుమార్ సిద్దిపేట బంధన్ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. అందరూ కలిసి రూ.9.02 లక్షలు డ్రా చేసుకుని పంచుకున్నట్లు తేలిందని.. డబ్బు రికవరీ కాలేదని చెప్పారు. సదరు నిందితుల బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేశామని, ఏ–1గా ఉన్న మహ్మద్ సమీయొద్దీన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఇతను హైదరాబాద్‌లోని అత్తాపూర్‌లో ఉంటూ బొగ్గులకుంట, కోఠిలో టీ–కేఫ్ పేరుతో హోటళ్లు నడుపుతూ సైబర్ నేరగాళ్లకు అమాయక ప్రజల బ్యాంకు ఖాతా వివరాలు అందజేస్తున్నట్లు గుర్తించామని చెప్పారు.

అమాయకంగా ఏవీ నమ్మొద్దు..

ప్రజలు అమాయకంగా ఎలాంటి లింకులు, మోసపూరిత ప్రకటనలను నమ్మవద్దని ఎస్పీ జానకి సూచించారు. వివరాలు ఎవరికి చెప్పవద్దని, ఆన్‌లైన్ గేమ్‌లు ఆడి సైబర్ నేరగాళ్ల వలకు చిక్కవద్దని కోరారు. డిజిటల్ అరెస్టులు ఉండవని.. అలాటి ఫోన్‌కాల్స్‌కు భయపడొద్దన్నారు. అనుమానం వస్తే టోల్‌ఫ్రీ నంబర్ 1930ని ఫిర్యాదు చేయాలని కోరారు. సమావేశంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ సుదర్శన్‌రెడ్డి, జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్, ఎస్‌ఐ శివానందంగౌడ్, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం సంచులపై నిద్రిస్తున్న రైతు

ధాన్యం వెల్లువ

- కళకళలాడుతున్న నవాబుపేట మార్కెట్ యార్డు
- 40వేలకు పైగా ధాన్యం బస్తాల రాక
- మళ్లీ వాయిదా పడిన టెండర్లు

నవాబుపేట: ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా వరికోతలు చివరిదశకు రావడంతో.. మార్కెట్ యార్డులకు ధాన్యం రాక భారీగా పెరిగింది. నవాబుపేట మార్కెట్‌కు ఆదివారం 40 వేల బస్తాలకు పైగా ధాన్యం వచ్చి చేరింది. గతవారం వరుసగా సెలవులతో ధాన్యం పేరుకుపోగా..తూకాలు కొనసాగుతున్నప్పటికీ యథావిధిగా రోజువారీగా ధాన్యం వస్తోంది. దీనికి తోడు ఆదివారం టెండర్లు జరగకపోవడంతో మార్కెట్ యార్డు మొత్తం ధాన్యం రాసులతో నిండిపోయింది. గత వారంలో రెండుసార్లు టెండర్లు వాయిదా పడగా.. తాజాగా ధాన్యం ఎక్కువగా రావటంతో టెండర్లు వాయిదా వేశారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్‌లో కావాల్సిన ఏర్పాట్లు చేయలేదు, ధాన్యం ఎక్కువగా ఉన్నా.. టెండర్లు సమాయానిక జరగడం లేదు, అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోయారు. దీనిపై మార్కెట్ కార్యదర్శి రమేష్‌ను వివరణ కోరగా.. ధాన్యం ఎక్కువగా రావటం వల్ల ఇబ్బంది వచ్చిందని, వీలైనంత త్వరగా టెండర్లు జరిగేలా చూస్తామని తెలిపారు.



ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న మార్కెట్ చైర్మన్ లింగం తదితరులు

రైతుల సమస్యలు పరిష్కరిస్తాం..

రైతుల సమస్యలు పరిష్కరించి ప్రతి రోజు టెండర్లు జరిగేలా చూస్తామని మార్కెట్ చైర్మన్ లింగం తెలిపారు. ఆదివారం ఆయన మార్కెట్‌లో ధాన్యం నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం యార్డులో ధాన్యం నిల్వలు ఎక్కువగా ఉండడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని, అవసరమైతే మంగళవారం మినహా ప్రతి రోజు టెండర్లు జరిగేలా చేసి, రైతుల సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం



మక్తల్: పట్టణంలోని ఈ నెల 15న జరిగే శ్రీ పడమటి ఆంజనేయస్వామివారి జాతరకు సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరుకావాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదివారం హైదరాబాద్‌లో వారిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. ఎమ్మెల్యేతోపాటు బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, చంద్రకాంత్‌గౌడ్, రవికుమార్‌యాదవ్, ప్రణేష్‌కుమార్ ఉన్నారు.

కేజీబీవీ విద్యార్థినులకు అస్వస్థత

నాగర్‌కర్నూల్ క్రైం: మున్సిపాలిటీ పరిధిలోని నాగనూలు శివారులో ఉన్న కేజీబీవీలో ముగ్గురు విద్యార్థినులు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఇంటర్మీడియట్ చదువుతున్న అక్షయ తన తల్లి తీసుకువచ్చిన చపాతి, చికెన్ తినడంతో సాయంత్రం అస్వస్థతకు గురై వాంతులు చేసుకుంది. అలాగే మరో ఇద్దరు విద్యార్థినులు పూజిత, హేమలత అనారోగ్య సమస్యలతో అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఉపాధ్యాయులు వెంటనే ముగ్గురిని జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే సామాజిక మాధ్యమాల్లో కేజీబీవీలో ఫుడ్ పాయిజన్ అయిందని వైరల్ కావడంతో కలకలం రేగింది. ఈ ఘటనపై కేజీబీవీ ప్రత్యేకాధికారి శోభారాణిని వివరణ కోరగా ఎలాంటి ఫుడ్‌పాయిజన్ జరగలేదని, ఒక విద్యార్థినికి తన తల్లి తీసుకువచ్చిన మధ్యాహ్నం భోజనం తిని, మరో ఇద్దరు విద్యార్థినులు అనారోగ్య సమస్యలతో బాధపడటంతో ఆస్పత్రికి తీసుకువచ్చామని చెప్పారు.